
సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



రైతు కష్టం.. వర్షార్పణం

ఇటీవల కురిసిన అధిక వర్షాలతో పంటలకు అపార నష్టం కలిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 8లో ▸



కొట్టుకుపోయిన రోడ్డు

దోర్నాల్ – స్టేషన్‌ధారూరు మధ్య కాగ్నా నదిపై నిర్మించిన తాత్కాలిక మట్టి రోడ్డు వర్షాలకు కొట్టుకుపోయింది. 8లో ▸



అసంపూర్తిగా..

బంట్వారంలోని మోడల్ స్కూల్ హాస్టల్ భవనం అసంపూర్తిగా ఉంది. విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. 9లో ▸

న్యూస్‌రీల్

18నుంచి డైట్ సెట్ పరీక్షలు

అనంతగిరి: ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు డైట్ సెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్‌లోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఉదయం 9నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

మా ప్రాంతం షూటింగ్‌లకు అనుకూలం

హాస్యనటుడు బ్రహ్మానందంతో ఎమ్మెల్యే కాలె యాదయ్య



నవాబుపేట: చేవెళ్ల, నవాబుపేట ప్రాంతాలు సినిమా షూటింగ్‌లకు అనుకూలంగా ఉంటాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య హాస్యనటుడు బ్రహ్మానందంకు తెలిపారు. మండలంలోని ఎల్లకొండ గ్రామంలో గురువారం సినిమా షూటింగ్ జరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అక్కడికి వెళ్లి బ్రహ్మానందంను కలిశారు. ఇక్కడి పొలాలు, ఆలయాలు, పచ్చటి ప్రదేశాలు షూటింగ్ చేసుకునేందుకు అనుకూలంగా ఉంటాయని తెలిపారు.

నేవీ హెడ్ క్వార్టర్‌ను సందర్శించిన టీఆర్‌ఆర్



పరిగి: ఢిల్లీ పర్యటనలో ఉన్న పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి నేవీ హెడ్ క్వార్టర్‌ను సందర్శించారు. అధికారులతో కలిసి నేవీ రాడార్ స్టేషన్‌ను వీక్షించారు. రాడార్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. పూడూరు మండలంలో ఏర్పాటు చేయనున్న నేవీ రాడార్ స్టేషన్ గురించి ఆరా తీశారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్



వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్

మర్పల్లి: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్ ఆదేశించారు. గురువారం మండలంలోని పట్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే వారిని ఆప్యాయంగా పలకరించి వైద్యం చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రతి ఒక్కరూ తప్పని సరిగా సమయపాలన పాటించాలన్నారు. సాధారణ ప్రసవాలు జరిగే విధంగా ప్రోత్సహించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు రవీంద్రయాదవ్, బుచ్చిబాబు, విజయ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్



షాద్‌నగర్: తనను ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్‌గా నియమించినందుకు గాను గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని స్పీకర్ కార్యాలయానికి వెళ్లిన ఎమ్మెల్యే ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

అప్రమత్తతే ఆరోగ్యరక్ష

ముందస్తు జాగ్రత్తలతో సగం రోగాలు రాకుండా చూసుకోవచ్చు

- వికారాబాద్ జనరల్ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు
- ప్రైవేటుకు వెళ్లి డబ్బు వృథా చేసుకోవద్దు
- ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంచంద్రయ్య
- 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమానికి మంచి స్పందన



ఫోన్ ఇన్ కార్యక్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న వైద్యులు రాంచంద్రయ్య, వెంకటరమణ, శ్రావణ్‌కుమార్

సాక్షి ఫోన్ ఇన్

వికారాబాద్/అనంతగిరి: ''వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. లేకుంటే వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. వైద్య ఆరోగ్య శాఖ పరంగా తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నాం. వైద్యులతోపాటు స్పెషలిస్టులు అందుబాటులో ఉన్నారు. వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలి'' అని వికారాబాద్ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంచంద్రయ్య సూచించారు. గురువారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. సివిల్ సర్జన్ డాక్టర్ వెంకటరమణ, జనరల్ మెడిసిన్, సీనియర్ ప్రొఫెసర్ శ్రావణ్‌కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలు అడిగిన ప్రశ్నలకు వారు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ల్యాబ్‌లో దాదాపు 109 రకాల టెస్టులు చేసుకునేందుకు వీలుందన్నారు. టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, అల్ట్రాసౌండ్ తదితర టెస్టులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నాయి. పీహెచ్‌సీల్లో రక్త నమూనాలు ఇస్తే పరీక్షలు చేసి ఫోన్ ద్వారా రిపోర్టు అందజేస్తారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 56 మంది వైద్యులు, 145 మంది సిబ్బంది సేవలందిస్తున్నారు. ప్రజలు వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

ప్రతినెలా ఏదో ఒక రోజు బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహిస్తే రక్తం నిల్వలు పెరిగే అవకాశం ఉంటుంది. ఆ దిశగా చొరవ తీసుకోవాలి.

– చైతన్య, వికారాబాద్

డాక్టర్: ప్రస్తుతం బ్లడ్ డొనేషన్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. మీరు చెప్పిన సలహా ప్రకారం ప్రతి నెలా ఏదో ఒక రోజు రెగ్యులర్‌గా కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం.

ఆస్పత్రిలో రెగ్యులర్‌గా రక్త పరీక్షలు నిర్వహించడం లేదని అంటున్నారు.. నిజమేనా?

– శ్రీధర్, చిట్టిగిద్ద, నవాబుపేట మండలం

డాక్టర్: ప్రతి రోజు బ్లడ్ టెస్టులు నిర్వహిస్తున్నాం. వైద్యులు సూచిస్తేనే పరీక్షలు చేస్తున్నాం.

ప్రస్తుతం విష జ్వరాలు ప్రబలుతున్నాయి. డెంగీ జ్వరంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

– హరీశ్‌రావు, తరిగోపుల, ధారూర్ మండలం

డాక్టర్: ఈ విషయాన్ని డీఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకెళ్లి గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించేలా చొరవ తీసుకుంటాం.

ఆస్పత్రిలో ఏయే రక్త పరీక్షలు చేస్తున్నారు?

– శాంతకుమార్, నవాబుపేట

డాక్టర్: అన్ని రకాల బ్లడ్ టెస్టులు చేస్తున్నాం. నిన్న ఒక్కరోజే జ్వరాలకు సంబంధించి 40 మందికి రక్త పరీక్షలు చేశాం.

చాలా మంది రోగులు ప్రైవేటు క్లినిక్‌లకు వెళ్తున్నారు. నవాబుపేట పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలి.

– సారా జగన్, నవాబుపేట

డాక్టర్: ఈ విషయమై డీఎంహెచ్‌ఓతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

– శ్రీకాంత్‌రెడ్డి, లింగంపల్లి, నవాబుపేట మండలం

డాక్టర్: కనీస జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చు. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వీధులు, ఖాళీ ప్రదేశాల్లో వర్షపు, మురుగు నీరు నిల్వకుండా చూసుకోవాలి. దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే రెండు రోజుల్లో జ్వరం తగ్గకుంటే టెస్టులు చేయించుకోవాలి. రిపోర్ట్ ఆధారంగా వైద్యం తీసుకోవాలి.

సీజనల్ వ్యాధుల నివారణకు హెల్త్ క్యాంపులు నిర్వహిస్తారా? దోమల నివారణకు ఫాగింగ్ చేయాలి.

– రవి, నవాబుపేట

డాక్టర్: హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసే విషయం గురించి డీఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకెళ్తాం. గ్రామాల్లో రెగ్యులర్‌గా ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకుంటాం.

ల్యాబ్‌లో అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తున్నారా?

– రవీందర్, వికారాబాద్

డాక్టర్: ఆస్పత్రిలో అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తున్నారు.

అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా?

– అశోక్, వికారాబాద్

డాక్టర్: వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. లేకుంటే బయట కొనుగోలు చేసి రోగులకు ఇస్తున్నాం.

జ్వరాలు ప్రబలుతున్నందున గ్రామాల్లో వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

– వెంకటయ్య, పూడూరు, పరమేశ్వర్, నవాబుపేట

డాక్టర్: జిల్లా వైద్యాధికారితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా ఆస్పత్రికి రావాలి. వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి.

డెంగీ లక్షణాలు ఎలా ఉంటాయి?

– కృష్ణ, నారెగూడ

డాక్టర్: రెండు రోజుల్లో జ్వరం తగ్గకుంటే తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలి. డెంగీ జ్వరం వస్తే ఒళ్లు నొప్పులు, తలనొప్పి, కంటి భాగంలో నొప్పి ఉంటుంది. జాయింట్ పెయిన్ అయితే చికున్ గున్యాగా భావించవచ్చు. పై లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. పరీక్షలు చేయించుకోవాలి.

పట్టణంలోని రాజీవ్‌నగర్ వద్ద నిర్మించిన కొత్త భవనంలోకి ఆస్పత్రిని మారుస్తున్నారా?

– సతీష్‌కుమార్, వికారాబాద్

డాక్టర్: ఇక్కడి నుంచి ఆస్పత్రిని షిఫ్ట్ చేయాలని ఎలాంటి ఆదేశాలు అందలేదు. ప్రసూతి సేవలు ఇక్కడే ఉండేలా అధికారులతో చర్చిస్తాం.

డయాలసిస్ పేషెంట్లకు మిషన్లు సరిపోవడం లేదు. వాటి సంఖ్యను పెంచాలి.

– రాజు, వికారాబాద్

డాక్టర్: డయాలసిస్ మిషన్లు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం ఆస్పత్రిలో 5 మిషన్లు మాత్రమే ఉన్నాయి. వాటి సంఖ్యను పెంచాలని ఆరోగ్య శ్రీ సీఈఓ, స్పీకర్ ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుంది.



హకీంపేట ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

ప్రాణాలైన ఇస్తాం.. ఫార్మాకు భూములివ్వం

అనుమతులు రద్దు చేసే వరకు పోరాడుతాం

- మా సమ్మతి లేకుండా భూములు ఎలా తీసుకుంటారని నిలదీత
- గో బ్యాక్ ఫార్మా పేరుతో పోలేపల్లి ఎల్లమ్మ ఆలయం నుంచి ర్యాలీ
- హకీంపేటలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేసిన రైతులు

దుద్యాల్: మండలంలో ఫార్మా కంపెనీ ఏర్పాటు నిర్ణయంపై హకీంపేట్, లగచెర్ల, పోలేపల్లి, పులిచెర్ల తండా, రోటి బండ తండాకు చెందిన భూ బాధిత రైతులు భగ్గుమన్నారు. గురువారం మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అక్కడి నుంచి హకీంపేట ప్రధాన కూడలి వరకు భారీ ర్యాలీ చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రశాంతంగా వ్యవసాయం చేసుకుంటూ ఎంతో చక్కని జీవనం సాగిస్తున్న రైతుల పొలాలు లాక్కోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న ఏ నాయకుడు కూడా ఇప్పటి వరకు తన సొంత నియోజకవర్గంలో ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయలేదన్నారు. కానీ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు హాని కలిగించేలా ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. హకీంపేట గ్రామానికి చెందిన రైతుల నుంచి 505 ఎకరాలు, పోలేపల్లి నుంచి 130 ఎకరాలు, లగచెర్ల, పులిచెర్ల తండా, రోటి బండ తండా రైతుల నుంచి 643 ఎకరాలు సేకరించి రైతులు నోట్లో మట్టి కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైన కంపెనీ ఏర్పాటు చేయాలంటే ముందుగా రైతులను సంప్రదించాలని, వారు అనుకూలంగా ఉంటేనే నిర్ణయం తీసుకోవాలన్నారు. కానీ ప్రభుత్వం బలవంతంగా భూ సేకరణ చేపడుతోందని ఆరోపించారు. ఫార్మా కంపెనీ ఏర్పాటు నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బలవంతపు భూ సేకరణ చేస్తామంటే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ప్రాణాలైన ఇస్తాం కానీ.. భూములు మాత్రం ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు.

రిలే దీక్షలు ప్రారంభం

మండలంలో ఫార్మా కంపెనీ ఏర్పాటుకు నిరసనగా గురువారం నుంచి బాధిత రైతులు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. కంపెనీ ఏర్పాటు అనుమతులను రద్దు చేసేంత వరకు దీక్షలు కొనసాగుతాయని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు బీ సురేశ్ రాజ్, భూ బాధితులు రాకం యాదయ్య, బసప్ప, నర్సింలు, అంజి, మల్లికార్జున్, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కలెక్టర్ ప్రతీక్‌జైన్



అనంతగిరి: ఎస్సీ నిరుద్యోగ మహిళలు ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ కార్పొరేషన్ కింద నిరుద్యోగులైన ఎస్సీ మహిళలకు కుట్టు మిషన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా కుట్టు మిషన్ ఇస్తారని తెలిపారు. దాని ద్వారా ఉపాధి పొందవచ్చన్నారు. టైలరింగ్ శిక్షణకు కనీస విద్యార్హత 5వ తరగతి అని, జిల్లాలో నివసించే 18 నుంచి 35 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ కేంద్రాల్లో సెంటర్లు ఉన్నాయని తెలిపారు. 66 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తారని చెప్పారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు జిరాక్స్ పత్రులు, ఆధార్ కార్డ్, కులం, ఆదాయం, విద్యార్హతలు, రెండు పాస్ ఫొటోలను కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ ఆఫీసులో అందజేయాలని సూచించారు. ఈ నెల 20వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. ఇతర సమాచారం కోసం ఫోన్ నంబర్ల 08416 255866/98495 82036/93981 93671లో సంప్రదించాలన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

ధరణి అర్జీలు పరిష్కరించండి

సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

కొడంగల్ రూరల్: వివిధ పనుల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ వారికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ సూచించారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా శాఖలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు, ప్రజలు కోరే ధ్రువపత్రాలను ఆలస్యం చేయకుండా అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ధరణి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.

విద్యార్థులతో మమేకం కావాలి

అనంతరం పట్టణ శివారులోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులం, కస్తూర్బా గాంధీ విద్యాలయం, మున్సిపల్ పరిధిలోని గిరిజన గురుకులాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యాన్ని కాపాడుకుందాం

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ హరిసర్వోత్తమన్

కడ్తాల్: జీవ వైవిధ్యం దెబ్బతింటే పర్యావరణంతో పాటు మానవ మనగడకు ముప్పు వాటిల్లుతుందని.. జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ (జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) హరిసర్వోత్తమన్ అన్నారు. అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్–తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్కూల్ ఎర్త్ క్లబ్ యంగ్ ఎర్త్ లీడర్స్' సెకండ్ బ్యాచ్ ఓరియంటేషన్ కార్యక్రమం గురువారంతో ముగిసింది. శిక్షణ కార్యక్రమానికి మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట్ జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరిసర్వోత్తమన్ మాట్లాడుతూ.. విచక్షణా రహితంగా చెట్లను నరకడం మానుకోవాలని, పంటలకు ఇష్టానుసారం క్రిమిసంహారక మందులను వినియోగించొద్దని సూచించారు. వృక్ష, జంతు, పక్షి జాతులు అంతరించిపోతే మానవ మనుగడకు ప్రమాదమని హెచ్చరించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపివేయడం ద్వారా పర్యావరణాన్ని రక్షించుకోవాలని పేర్కొన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

అనంతగిరి: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు రాష్ట్ర వ్యాప్తంగా పంటలు, ఇళ్లు దెబ్బతిన్నందున కేంద్ర ప్రభుత్వం వెంటనే జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. భారీ వర్షాలకు ఇళ్లు, పంటలు దెబ్బతిన్నాయిని, పశువులు మృత్యువాత పడ్డాయని తెలిపారు. బాధితులను ఆదుకోవాలని కోరారు. ఎకరాకు కనీసం రూ.15 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్వం కోల్పోయిన రైతులకు రూ.50 వేలు ఇవ్వాలన్నారు. వరదల కారణంగా గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ చేయాలని విన్నవించారు. రాష్ట్రానికి తక్షణ సాయం కింద రూ.2 వేల కోట్ల ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు అనంతయ్య, వెంకటేష్, జగదాంబ, సురేష్, ఖాదర్, అనంతయ్య పాల్గొన్నారు.

ఆక్రమణల పర్వం!



దాతర్‌చెరువు నుంచి వచ్చే కాలువను కబ్జా చేసి బఫర్‌జోన్‌లో చేపట్టిన నిర్మాణం

ఇబ్రహీంపట్నం రూరల్: చెరువులు, కుంటలు, కాలువలు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నాయి. ఏకంగా కలెక్టరేట్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్నవి కూడా కబ్జారాయుళ్ల చెరలోకి వెళ్లిపోయాయి. అయినా ఇటు ఇరిగేషన్, ఆటు రెవెన్యూ అధికారులు సైతం ఈ ఆక్రమణలపై పెదవి విప్పకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెరువులను చెరబడితే చెరసాలకే అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో కబ్జారాయుళ్ల గుండెల్లో దడ పుట్టుకుంది. ఇప్పటికైనా జల వనరుల్లో ప్రధానమైన చెరువులను పరిరక్షిస్తారో లేదో చూడాలి.

చెరలో చారిత్రక చెరువులు

- కలెక్టరేట్‌కు సమీపంలోని కొంగరకలాన్‌లో వందల ఏళ్ల చరిత్ర కలిగిన చెరువులు ఉన్నాయి. వీటిలో అతిముఖ్యమైంది కొత్త చెరువు. ఊరికి పడమరవైపు కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉంది. ఈ చెరువు విస్తీర్ణం 18.77 ఎకరాలు. ఓ రియల్ ఎస్టేట్ సంస్థ ఈ చెరువును కబ్జా చేసింది. శిఖంతో పాటు ఎఫ్‌టీఎల్‌లో ప్లాట్లు చేసింది. బఫర్‌జోన్‌ను సైతం ఆక్రమించి రియల్ వ్యాపారంతో రూ.కోట్లు గడించింది. ప్రస్తుతం చెరువు పట్టుమని పది ఎకరాలు కూడా లేదు.
- కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో వడ్లవాని కుంట 5.77 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ కుంటను సైతం ఓ రియల్ ఎస్టేట్ సంస్థ రెండు ఎకరాల మేర ఆక్రమించింది. బఫర్‌జోన్‌ను కూడా వదిలిపెట్టకుండా రోడ్లు, ప్లాట్లు చేసింది.
- గ్రామానికి ఉత్తరాన ఉన్న అతిపెద్ద దాతర్ చెరువు విస్తీర్ణం 50.12 ఎకరాలు. ఈ చెరువులో ఏకంగా కబ్జారాయుళ్లు కడీలు పాతారు. దీనిపై కొంతమంది కోర్టులను సైతం ఆశ్రయించారు. ఈ చెరువులోకి వచ్చే కాలువలు కూడా పెద్ద ఎత్తున కబ్జాకు గురయ్యాయి.
- దాతర్‌చెరువు నిండితే కాలువల నుంచి నేరుగా ఇబ్రహీంపట్నం చెరువులోకి నీరు వెళ్తుంది. ఈ కాలువను కూడా వదిలిపెట్టడం లేదు. ఇటీవల కొత్తగా వేస్తున్న ఓ వెంచర్ నిర్వాహకులు కాలువను కబ్జా చేసి ప్రహరీ నిర్మించారు. వెంచర్‌లో వేసిన డ్రైనేజీ పైపులైన్లు ఇదే కాలువలోకి కలిపారు. గొలుసుకట్టు చెరువుల్లోకి వెళ్లే నీరు వెళ్లకుండా అడ్డుగోడలు నిర్మించారు. 60 ఫీట్ల వెడల్పు పారే ఈ కాలువ పూర్తిగా కుంచించుకుపోయింది.
- ఆయా కబ్జాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. అయినా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రకృతి సిద్ధమైన జల వనరులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

నాన్‌ టీచింగ్‌ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

దోమ: కస్తూర్బాగాంధీ పాఠశాలలో నాన్‌ టీచింగ్‌ పోస్టులకు దరఖాస్తులను స్వీకరించామని ఎంపీడీఓ మహేశ్‌బాబు, తహసీల్దార్‌ పురుషోత్తం తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ స్వప్నతో కలిసి ఐదు మంది మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించి ఇంటర్వ్యూ నిర్వహించారు. కార్యక్రమంలో కేజీబీవీ కంప్యూటర్‌ ఆపరేటర్‌ లావణ్య, ఎమ్మార్సీ కంప్యూటర్‌ ఆపరేటర్‌ నసీర్‌ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అల్లరాయప్ప ఉత్సవాలు


మూలవిరాట్‌

దౌల్తాబాద్‌: మండలంలోని ఇండాపూర్‌ పంచాయతీ పరిధిలోని అడవిలో వెలసిన అల్లరాయప్ప జాతర ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు సాయంత్రం పల్లకీసేవలో ఊరేగిస్తారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మూడు రోజుల పాటు క్రీడా పోటీలు

కొడంగల్‌ రూరల్‌: నియోజకవర్గంలోని కొడంగల్‌, బొంరాస్‌పేట, దౌల్తాబాద్‌, దుద్యాల్‌ మండలాలకు సంబంధించిన పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 19, 20, 21వ తేదీల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ రాంరెడ్డి, హస్నాబాద్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ పీడీ అనిల్‌ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జోనల్‌ లెవల్‌(ఎస్‌జీఎఫ్‌) గేమ్స్‌ అండ్‌ స్పోర్ట్స్‌ కొడంగల్‌(పాఠశాల క్రీడా సమాఖ్య) ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 19వ తేదీన వాలీబాల్‌ కొడంగల్‌ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో, 20వ తేదీన ఖోఖో పోటీలు కొడంగల్‌ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో, 21వ తేదీన కబడ్డీ రావులపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అండర్‌-17, అండర్‌-14 విద్యార్థులు, విద్యార్థినిలు పాఠశాలల్లోని పీడీలకు తమ పేర్లను అందజేయాలని సూచించారు.

స్వయం ఉపాధితో రాణించాలి


ఆన్‌లైన్‌ సర్వీస్‌ సెంటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

దుద్యాల్‌: మహిళలు స్వయం ఉపాధితో రాణించాలని డీఆర్‌డీఓ, సెర్ప్‌ ఏపీడీ సరోజ పేర్కొన్నారు. గురువారం దుద్యాల్‌ గ్రామంలో సందర్శించి ఇందిర మహిళ శక్తి పథకం ద్వారా యాదవ మహిళ సంఘంలోని పది మంది మహిళలు ఏర్పాటు చేసుకున్న ఉపాధి కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సంఘం సభ్యులు తీసుకున్న రుణంతో కొందరు గేదెలు, గొర్రెలు, మేకలు కొనుగోలు చేశారన్నారు. మరో సభ్యురాలు మాదరి జయమ్మ తీసుకున్న రుణంతో కుమారుడి పేరిట ఆన్‌లైన్‌ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నట్టు చెప్పారు. ఇలా సంఘం సభ్యులు తీసుకున్న రుణాన్ని సద్వినియోగం చేసుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం రామ్మూర్తి, ఇన్‌చార్జి ఏపీఎం సత్యనారాయణ, సీసీలు సంజీవ్‌, యాదయ్య, రామచంద్రయ్య, వీఓఏ కృష్ణ, మహిళ సంఘం సభ్యులు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

రైతు కష్టం.. వర్షార్పణం


ఎన్కేపల్లిలో కుళ్లిపోయిన టమాటా


మోమిన్‌పేటలోని మొరంగపల్లిలో వర్షపు నీటిలో పత్తి

అధిక వర్షాలతో అపార నష్టం
- కుళ్లిపోయిన కూరగాయ, పత్తి పంటలు
- పెట్టుబడులు సైతం రాని పరిస్థితి

మోమిన్‌పేట: ఇటీవల కురిసిన అధిక వర్షాలతో పంటలకు అపార నష్టం కలిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో కూరగాయ, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. క్యాబేజీ, కాలిఫ్లవర్‌, మిర్చి, టమాటా, వంకాయ, కాకర, బీరకాయ పంటలు చేతికి రాకుండా పోయాయి. ఆకు కూరలు సైతం వర్షానికి దెబ్బతిన్నాయని వాపోయారు. పెట్టిన పెట్టుబడులు చేతికి వచ్చే సమయంలో వరుణుడు కన్నెర్ర చేశాడని విలపించారు. అలాగే మెట్ట భూమిలో పత్తిని సాగు చేసిన రైతులకు నిరాశే మిగిలింది. అధికంగా కురిసిన వర్షంతో పంట ఎర్ర బారి ఆకులు రాలిపోతున్నాయి. వేరు మురిగిపోయి పంట ఎండుతుంది. ఎన్నో ఆశలతో సాగు చేసిన తెల్ల బంగారంపై వరుణుడు నీళ్లు చల్లాడు.

గగ్గోలు పెడుతున్న అన్నదాతలు

మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పత్తిని ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. దాదాపు 17 వేల ఎకరాల్లో పత్తి సాగుకు ఉపక్రమించారు. దీంతో ఆయా రైతులు ఎక్కువగా నష్టపోయామని వాపోతున్నారు. ట్రాక్టరు దున్నుకోవడం మొదలు విత్తుకోవడం, కలుపుతీత, ఇప్పటికే మూడుసార్లు మందులను పిచికారీ చేయడం తదితర ఖర్చులకు ఎకరాకు రూ.25వేల వెచ్చించామని గగ్గోలు పెడుతున్నారు. చేసిన కష్టం వర్షార్పణం అయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాయ, పూత రాలుతుందని చెట్టుకు ఐదారు కాయలు మాత్రమే మిగిలాయని చెబుతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని నష్టపోయిన రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



నాలుగు ఎకరాలలో పత్తిని సాగు చేశా. మొదట్లో బాగనే ఏపుగా పెరిగింది. వరుసగా కురిసిన వర్షాలకు గూడ, పిందె పూర్తిగా రాలిపోయింది. మొక్కలు ఎర్ర బారి ఆకులు రాలుతున్నాయి. పూర్తిగా నష్టపోయాను. ప్రభుత్వమే ఆదుకొని నష్ట పరిహారం చెల్లించాలి.

– నర్సింలు, రైతు, ఎన్కేపల్లి

అంబులెన్స్‌లో కవలల జననం

పురుడు పోసిన ఈఎంటీ, పైలట్‌
- వైద్యుల నిర్లక్ష్యమంటూ ఆరోపణలు


అంబులెన్స్‌లో శిశువులతో సిబ్బంది

తాండూరు టౌన్‌: కాన్పు కోసం వచ్చిన మహిళ పరిస్థితి బాగలేకపోవడంతో మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా అంబులెన్స్‌లోనే కాన్పు అయిన ఘటన చోటు చేసుకుంది. ఈ కాన్పులో ఆ తల్లి కవల పిల్లలకు జన్మనిచ్చింది. కుల్కచర్ల మండలం ముజాయిదీపూర్‌ గ్రామానికి చెందిన వెంకటప్ప భార్య చంద్రకళను గురువారం కాన్పు నిమిత్తం తాండూరు పట్టణంలోని మాతా శిశు ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు కాన్పు ఇబ్బందిగా ఉందని, హైదరాబాద్‌లోని నీలోఫర్‌ ఆస్పత్రికి తీసుకెళ్లాలని రెఫర్‌ చేశారు. దీంతో 108 అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా ధారూర్‌ సమీపంలోకి వెళ్లగానే చంద్రకళకు పురిటినొప్పులు మొదలయ్యాయి. దీంతో అంబులెన్స్‌ ఈఎంటీ శాంత్‌కుమార్‌, పైలట్‌ శివకుమార్‌లు కాన్పు చేశారు. ఈ కాన్పులో మొదట ఆడపిల్ల జన్మించగా, తర్వాత మగశిశువు జన్మించాడు. అయితే మగశిశువు ఏడవక పోవడంతో ఈఎంటీ శాంత్‌కుమార్‌ సీపీఆర్‌ చేసి శిశువుకు ప్రాణం పోశాడు. అనంతరం తల్లీపిల్లలను వికారాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. ఐదో కాన్పులో చంద్రకళకు కవలలు పుట్టడం విశేషం.

వైద్యుల సిఫార్సుపై తీవ్ర విమర్శలు

కాన్పు కోసం మాతా శిశు ఆస్పత్రికి వచ్చిన గర్భిణి పరిస్థితి బాగోలేదంటూ హైదరాబాద్‌కు తరలించడం, కొద్ది వ్యవధిలోనే అంబులెన్స్‌లో సాధారణ కాన్పు ద్వారా కవలలకు జన్మనివ్వడంతో వైద్యుల తీరుపై పలువురు మండిపడ్డారు. పరిస్థితి విషమంగా ఉంటే చంద్రకళకు సాధారణ కాన్పు ఎలా సాధ్యమైందని, చేతులు దులిపేసుకునేందుకే వైద్యులు ఇలా రెఫర్‌ చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.

నెలలు నిండలేదు

గర్భిణి చంద్రకళకు నెలలు నిండలేదు. ఏడు నెలలు ఉండటం, కడుపులో కవల శిశువులు ఉండటం, వారు బరువు తక్కువగా ఉన్నారు. దీంతో మెరుగైన వైద్య నిమిత్తం హైదరాబాద్‌లోని నీలోఫర్‌ ఆస్పత్రికి డాక్టర్లు రెఫర్‌ చేశారు.

– డాక్టర్‌ రవిశంకర్‌, సూపరింటెండెంట్‌, ఎంసీహెచ్‌, తాండూరు

కొట్టుకుపోయిన డైవర్షన్‌ రోడ్డు


బిక్కుబిక్కుమంటూ కాగ్నా నదిని దాటుతున్న స్థానికులు

- కాగ్నా నదిపై ప్రమాదకరంగా దోర్నాల్‌–స్టేషన్‌ధారూరు రహదారి
- ప్రజల నిరసనతో మరమ్మతులు


మరమ్మతుల తర్వాత రాకపోకలకు అనువుగా మారిన రోడ్డు

ధారూరు: దోర్నాల్‌–స్టేషన్‌ధారూరు మధ్యనున్న కాగ్నా నదిపై నిర్మించిన తాత్కాలిక మట్టి రోడ్డు(డైవర్షన్‌) ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో గురువారం స్థానికులు తీవ్ర ఆందోళన చేపట్టారు. మూడు కిలోమీటర్ల దూరానికి 30 కిలోమీటర్లు తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. దీంతో స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌ చొరవ తీసుకుని యంత్రాంగాన్ని ఆదేశించడంతో సాయంత్రం కల్లా డైవర్షన్‌ రోడ్డు మరమ్మతు చేపట్టారు. రాత్రి వరకు పూర్తిస్థాయి రాకపోకలు కొనసాగేలా చేస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రవణ్‌కుమార్‌ తెలిపారు.

వర్షమొస్తే నిత్యం ఇక్కట్లు

కాగ్నానదిపై ఉన్న పాత వంతెన 2016లో నీటి ప్రవాహ ఉధృతికి దెబ్బతింది. రాకపోకలకు అవరోధంగా మారడంతో పాత వంతెనను తొలగించి డైవర్షన్‌ రోడ్డు ఏర్పాటు చేశారు. కొత్త వంతెన నిర్మాణానికి 2017లో రూ.4.70 కోట్లతో పనులు ప్రారంభించారు. అయినా ఇప్పటివరకు వంతెన నిర్మాణం పూర్తి కాలేదు. వానాకాలంలో కాగ్నా ఉధృతికి డెవర్షన్‌ రోడ్డు తరుచూ దెబ్బతినడం, ప్రమాదకరంగా మారడం షరామామూలైంది. గురువారం డైవర్షన్‌ రోడ్డుపై మట్టి కొట్టుకపోయి రాకపోకలకు ఇబ్బంది కలిగించింది. నదికి అవతలి వైపు ఉన్న దాదాపు 28 గ్రామాల ప్రజలు ధారూరుకు రావడానికి చుట్టూ 30 కిలోమీటర్లు తిరిగి వస్తున్నారు. డైవర్షన్‌ రోడ్డు మరమ్మతు చేయడంతో పాటు వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆడుకుంటూ వెళ్లి.. అనంతలోకాలకు

- బావిలో పడి మూడేళ్ల బాలుడు దుర్మరణం
- కుల్కచర్ల మండలం సాల్వీడులో ఘటన


వీరభద్ర (ఫైల్‌)

కుల్కచర్ల: కళ్లముందే ఆడుకుంటూ.. తన బోసి నవ్వులతో కుటుంబ సభ్యులను సంతోష పెట్టే బాలుడు నిమిషాల వ్యవధిలో ప్రాణం కోల్పోయాడు. ఒక్కగానొక్క కొడుకు మృతితో బాధిత తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. కుల్కచర్ల మండలం సాల్వీడుకు చెందిన మాదాసు లక్ష్మి అలియాస్‌ సావిత్రికి ఎనిమిదేళ్ల క్రితం హన్వాడ మండలం నాయినోనిపల్లికి చెందిన బాబుతో వివాహం జరిగింది. ఇదిలా ఉండగా లక్ష్మి బుధవారం తల్లిగారి ఊరైన సాల్వీడుకు వచ్చింది. గురువారం పొలం వద్ద జొన్న చేను పనులు చేస్తున్న క్రమంలో ఆమె కుమారుడైన వీరభద్ర(03) ఆడుకుంటూ.. సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ బావిలో పడిపోయాడు. కొద్దిసేపటి తర్వాత బాలుడి కోసం వెతకగా బావిలో కనిపించాడు. బయటకు తీసిన అనంతరం పరిగి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇళ్లకు సమీపంలో ప్రమాదకంగా ఉన్న మన్నె వెంకటయ్యకు చెందిన బావి కారణంగానే తమ కొడుకు మరణించాడని లక్ష్మి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.

బంగారు గొలుసు, నగదు అపహరణ

పూడూరు: చాకుతో బెదిరించి బంగారు గొలుసు, నగదు అపహరించిన సంఘటన బుధవారం చన్గోముల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్‌ మున్సిపల్‌ వెంకటేశ్వరకాలనీకి చెందిన ఊరడి సాయికుమార్‌, తన స్నేహితురాలితో కలిసి చేవెళ్లలోని మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ వైద్యం చేయించుకుని తిరిగి వికారాబాద్‌కు వస్తుండగా మార్గ మధ్యలో కండ్లపల్లి గేటు సమీపంలో నీలగిరి చెట్ల వద్ద ఫొటోలు దిగేందుకు వెళ్లారు. ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు నంబర్‌ లేని ద్విచక్ర వాహనంపై అక్కడికివచ్చి ఫొటోలు దిగుతున్న తమను అడ్డగించి ముఖానికి ఉన్న మాస్కులు తీయాలని బెదించారు. ఊరడి సాయికుమార్‌ను రాడ్డుతో కొట్టారని, మరో ఇద్దరు వ్యక్తులు చాకుతో బెదిరించి స్నేహితురాలి మెడలోని తులం బంగారు గొలుసు, రూ. 4వేలు లాక్కుని వెళ్లారని సాయి కుమార్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రాములు మృతదేహం

తాండూరు టౌన్‌: తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మద్దూర్‌ గ్రామానికి చెందిన రాములు (40)ను ఈనెల 3వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు ఆస్పత్రిలో చేర్పించి వెళ్లి పోయారు. కాగా చికిత్స పొందుతూ అతడు గురువారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు మృతదేహన్ని తీసుకెళ్లాల్సిందిగా వారు కోరారు.

ఠాణాలో పాము కలకలం

తాండూరు టౌన్‌: బుసలు కొడుతూ ఓ నాగు పాము పోలీసుస్టేషన్‌ ఆవరణలో ప్రత్యక్షమైంది. ఈ ఘటన గురువారం తాండూరు పట్టణ ఠాణాలో చోటు చేసుకుంది. వెంటనే పోలీసులు పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన స్నేక్‌ క్యాచర్‌ సజ్జద్‌కు ఫోన్‌ చేసి రప్పించారు. అతడు చాకచక్యంగా పామును పట్టుకుని అనంతరం అడవిలో వదిలేశాడు. దీంతో స్టేషన్‌లో విధుల్లో ఉన్న సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

మెకానిక్‌ షెడ్డులోకి దూసుకెళ్లిన తుఫాన్‌



పరిగి: మద్యం మత్తులో వాహనం నడపడంతో అది మెకానిక్‌ షెడ్డులోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన పరిగి పట్టణ కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడంగల్‌ వైపు వెళ్తున్న తుఫాన్‌ డ్రైవర్‌ మద్యం మత్తులో వాహనం నడుపుతూ కొడంగల్‌ చౌరస్తా చేరుకోగానే అక్కడ మెకానిక్‌ షెడ్డులోకి దూసుకెళ్లింది. దీంతో ఒక్కసారిగా శబ్దం రావడంతో షెడ్డులో పనిచేసేవారు భయాందోళనకు గురయ్యారన్నారు. షెడ్డులోకి దూసుకొచ్చిన వాహనం ఒక్కసారిగా ఆగిపోయింది. ఇంజన్‌లో నుంచి పొగలు రావడంతో స్థానికులు బ్యాటరీ కనెక్షన్లు తొలగించారు. అనంతరం వారు పోలీసులకు సమాచారం చేరవేశారు. తుఫాన్‌లో ప్యాసింజర్లు ఎవరూ లేకపోవడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు.

రాహుల్‌ వ్యాఖ్యలు అవమానకరం


రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నేతలు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

అనంతగిరి: అమెరికా పర్యటనలో ఉన్న కాంగ్రెస్‌ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ వ్యవహారశైలి ఇబ్బందికరంగా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం వికారాబాద్‌లోని ఎన్టీఆర్‌ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మన దేశాన్ని వ్యతిరేకిస్తూ, విభేదిస్తూ, విషం చిమ్మే అమెరికా నేతలతో రాహుల్‌గాంధీ సమావేశం అవ్వడాన్ని తప్పుబడ్డామన్నారు. పరిస్థితులు అనుకూలిస్తే భారతదేశంలో రిజర్వేషన్లు రద్దు చేస్తామని రాహుల్‌ వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రిజర్వేషన్‌ల విషయంలో ఆయన అసలు రంగు బయటపడిందన్నారు. విదేశీ పర్యటనల్లో దేశంపట్ల, దేశ ప్రజాస్వామ్యం, ప్రజలను అవమానించేలా విమర్శలు చేయడం తగదన్నారు. బీజేపీ అధికారంలో ఉన్నంతవరకు రిజర్వేషన్‌లు రద్దు చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గత ఎన్నికలు సరిగ్గా జరగలేదని, బీజేపీ గెలుపును తప్పుబట్టడం అంటే ప్రజాస్వామ్యంలో ఓటర్లను అవమానపర్చడమే అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కేపీ రాజు, మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు శిరీష, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌, వివేకందారెడ్డి, పాండుగౌడ్‌, నందు, శ్రీనివాస్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, రాములు, బస్వలింగం, నరోత్తంరెడ్డి, యాదగిరి, చరణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


శ్రీనివాస్‌కు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్‌: సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రజలు కాంగ్రెస్‌ పార్టీలో చేరుతున్నారని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం పెద్దేముల్‌ మండల తింసాన్‌పల్లి గ్రామానికి చెందిన గుడిసే శ్రీనివాస్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్‌ పార్టీ నుంచి కాంగ్రెస్‌ పార్టీలోకి చేరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తన నివాసంలో నేతలకు కండువాలు కప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనల్లో గ్రామాలు అభివృద్ధిలో కుంటుపడ్డాయన్నారు. మళ్లీ కాంగ్రెస్‌ ప్రభుత్వంలో పల్లెలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్‌, నాయకులు ప్రవీణ్‌కుమార్‌, ఎల్లారెడ్డి, శ్రీనివాస్‌, నర్సిములు, ఆనందచారి తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌ బియ్యం పట్టివేత

పది క్వింటాళ్లు స్వాధీనం


పట్టుబడిన రేషన్‌ బియ్యాన్ని సీజ్‌ చేస్తున్న అధికారులు

పరిగి: అక్రమంగా రేషన్‌ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని సీజ్‌ చేసిన సంఘటన రాఘవపూర్‌ గేట్‌ వద్ద చోటు చేసుకుంది. ఎస్సై సంతోష్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్‌ పట్టణానికి చెందిన కేతావత్‌ రాహుల్‌ మండలంలోని వివిద గ్రామాల్లో తిరుగుతూ తక్కువ ధరలకు రేషన్‌ బియ్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. ఈ క్రమంలో బుధవారం గ్రామాల్లో తిరిగి రేషన్‌ బియ్యం సేకరించి వెళ్తుండగా రాఘవపూర్‌ గేట్‌ దగ్గర పోలీసులు అతడిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పౌర సరఫరాల శాఖ అధికారులకు సమాచారం అందించి రేషన్‌ బియ్యమని నిర్ధారించారు. 10 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కేంద్ర మంత్రి బండిని కలిసిన నేతలు

మర్పల్లి: మండలానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్‌ను కలిశారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో నేతలు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. సెన్సార్‌ బోర్డు సభ్యుడు మల్లేశం, నాయకులు బలరాంగౌడ్‌, జైపాల్‌, శ్రీమంత్‌, మహేశ్‌ తదితరులు ఉన్నారు.


బండి సంజయ్‌తో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

తాళం వేసిన ఇంట్లో చోరీ

నాలుగు తులాల బంగారం, 20 తులాల వెండి అపహరణ

కుల్కచర్ల: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాంనగర్‌ గ్రామపంచాయతీ సూర్యనాయక్‌ తండాకు చెందిన గోబ్రియానాయక్‌ తన భార్య ఐదు నెలల క్రితం మృతి చెందటంతో సొంతిల్లు విడిచి మరో ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం గోబ్రియానాయక్‌ సొంతింటిలో చోరీ జరిగింది. దుండగులు బీరువాలో ఉన్న 4 తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలను అపహరించుకెళ్లారు. దీంతో ఆయన ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్‌ టీంను రప్పించి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

లడ్డూ దక్కించుకున్న ముస్లిం యువకుడు

రూ. 75 వేలకు కైవసం


లడ్డూతో మోహిషహరీ సర్కార్‌

తాండూరు టౌన్‌ : హిందూ ముస్లిం భాయీ భాయీ, పరమత సహనం పాటించాలని చెప్పడమే కాదు చేసి చూపించాడు ఓ ముస్లిం యువకుడు. తాండూరు పట్టణానికి చెందిన మోహిషహరీ సర్కార్‌ అనే యువకుడు మాణిక్‌ నగర్‌లోని వినాయక విగ్రహం వద్ద పెట్టిన లడ్డూ వేలం పాటలో పాల్గొని రూ. 75 వేలకు లడ్డూని దక్కించుకున్నాడు. కులమతాలకు అతీతంగా ప్రజలంతా కలిసి మెలిసి ఉండాలని చెప్పేందుకే లడ్డూను వేలం పాటలో దక్కించుకున్నట్లు సర్కార్‌ చెప్పాడు.